సాక్షి సిద్దిపేట

శనివారం । 31 । మే । 2025

నేడు ఫోన్ ఇన్ ఏడీఏ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వానాకాలం సాగు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ ఏడీఏ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సాగులో విత్తనాల ఎంపిక.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల వినియోగం తదితర అంశాలను సిద్దిపేట అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి పద్మతో ఫోన్‌లో నేరుగా మాట్లాడవచ్చు.




తేదీ : 31-05-2025 (శనివారం)
సమయం : ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
9010455525, 8686960064

దోస్త్ రెండో విడత షురూ..

జూన్ 8వరకు గడువు

సిద్దిపేటఎడ్యుకేషన్: దోస్త్ రెండో విడత డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు ఇంటర్మీడియెట్ పూర్తయిన విద్యార్థులు, మొదటి విడతలో రిజిస్ట్రేషన్ చేసుకోని వారు కూడా జూన్ 8వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక జూన్ 9వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని చెప్పారు. జూన్ 13న సీట్లు కేటాయిస్తారని, సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 18వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన విద్యార్థులు జూన్ 24 నుంచి 28 మధ్య.. కళాశాలలో సర్టిఫికెట్లను స్వయంగా ప్రిన్సిపల్‌కు అందించి, ఫీజు చెల్లించి సీటును ధ్రువీకరించుకోవాలన్నారు. మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు జూన్ 6వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ తప్పనిసరిగా చేయాలని తెలిపారు. ఏమైనా టెక్నికల్ సమస్యలు తలెత్తినా, పూర్తి వివరాలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇచ్చట.. చూడముచ్చట

ఎత్తయిన చెట్ల మధ్య వయ్యారాలు ఒలకబోస్తూ సాగే ఈ రహదారిలో ప్రయాణాన్ని ఎంత వర్ణించినా తక్కువే. ఈ దారి గుండా ప్రయాణం ఆహ్లాదకరం. ఆకాశాన్ని తాకినట్లు ఉండే తాటిచెట్లు.. మరో వైపు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మర్రిచెట్లు కలిసిపోయి ప్రయాణికులకు కనువిందు చేస్తున్నాయి. ఇలా ప్రకృతి రమణీయ దృశ్యాలను సాక్షి కెమెరా పుల్లూరు, సిద్దిపేట–కామారెడ్డి రోడ్డులో క్లిక్ మనిపించింది.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



సిద్దిపేట-కామారెడ్డి రోడ్డులో పచ్చని చెట్లు





పుల్లూరు గ్రామంలో పెద్దబండ సోయగం..

మల్లన్నా.. డిజిటల్ యోగమెప్పుడు?

సాంకేతికతకు దూరంగా కొమురవెల్లి ఆలయం

- ఆన్‌లైన్ చెల్లింపులు లేక భక్తుల అవస్థలు
- ఏటా కోటి మంది దర్శనం
- స్వామి వారి వార్షిక ఆదాయం రూ. 20 కోట్లపైనే..



స్వామి వారి మూలవిరాట్టు

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలలో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం ఒకటి. స్వామి వారిని ఏటా కోటి మందికి పైగా భక్తులు దర్శించుకుంటారు. ఆలయానికి సుమారు రూ.20 కోట్లకు పైగా వార్షిక ఆదాయం సమకూరుతున్నా సాంకేతికతకు దూరంగా ఉంది. ఇప్పటి వరకు ఆన్‌లైన్ సేవలు అమలు కాకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఆర్థిక వ్యవహారాలలో పారదర్శకతతో పాటు భక్తులు సులువుగా సేవలను పొందేందుకు ఆస్కారం లేకుండా పోయింది.

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులు.. వసతి గదులు, దర్శనం, నిత్యకల్యాణం, రుద్రాభిషేకం, అర్చన, పట్నం వేయడం, తలనీలాలు, ఒడిబియ్యం, బోనం తదితర ఆర్జిత సేవల కోసం రుసుం చెల్లించి టికెట్లు తీసుకోవాలి. రద్దీ ఎక్కువగా లేకపోతే పది పదిహేను నిమిషాలలో టికెట్లు లభిస్తాయి. రద్దీ ఎక్కువగా ఉంటే మాత్రం గంటల తరబడి క్యూలైన్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. స్వామి వారి దర్శనానికి తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఏటా సుమారు మూడు నుంచి నాలుగు లక్షల వరకు పట్నాలు, బోనాల టికెట్లను ఆలయం విక్రయిస్తోంది.



టికెట్ల కోసం లైన్‌లో వేచి ఉన్న భక్తులు

భక్తుల్లో అసహనం..

భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చినప్పుడే నిత్యాన్నసత్రానికి, కాటేజీల నిర్మాణాలకు విరాళాలు చెల్లిస్తుంటారు. ఆలయంలో ఆన్‌లైన్ సేవలు లేకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకురావడానికి ఆలయ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అవి కార్యరూపం దాల్చడం లేదు. మూడేళ్ల క్రితమే హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరాలయం, మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో కూడా సాంకేతికత సాయంతో డిజిటల్ హుండీలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లన్న ఆలయం సాంకేతికతలో వెనుకబడి ఉందని చెప్పవచ్చు.

బీరువాలోనే స్వైపింగ్ మిషన్

నాలుగేళ్ల క్రితమే ఆర్జిత సేవల టికెట్ల విక్రయ కేంద్రాలలో వినియోగానికి స్వైపింగ్ మిషన్ తీసుకువచ్చారు. కానీ సాంకేతికత కారణంతో బీరువాలోనే ఉంచారు. క్యూ ఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకువచ్చి భక్తులకు ఆన్‌లైన్ సేవలు తీసుకువస్తే సిబ్బంది పని భారంతో పాటు అక్రమాలకు చెక్ పెట్టవచ్చు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆన్‌లైన్ సేవలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



త్వరలోనే తీసుకువస్తాం

ఆలయంలో ఇప్పటికే టీఎస్ యాప్ అందుబాటులో ఉంది. త్వరలోనే దేవాదాయ శాఖ ఉన్నత అధికారులతో సంప్రదించి ఆన్‌లైన్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువస్తాం.



–అన్నపూర్ణ, ఈఓ, కొమురవెల్లి ఆలయం



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో కలెక్టర్ మనుచౌదరి

అర్హులందరికీ ఇళ్లు

- ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకం
- నిబంధనల మేరకే ఇల్లు నిర్మించుకోవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలకు తావివ్వకుండా పారదర్శకంగా ఎంపిక చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మున్సిపల్, ఆర్డీఓ కార్యాలయాలలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయ సమీపంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నమూనా గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడతగా 3,500 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. మరో రెండు నెలల్లో రెండో విడతగా ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. వచ్చే నెల 9వ తేదీలోగా ముగ్గు పోసి ఇల్లు వేగంగా కట్టుకొని గృహ ప్రవేశం చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఫ్రీ ఇసుక ట్రాక్టర్ కూపన్లు ఇస్తామన్నారు. డబ్బులు లేకపోతే మహిళా సంఘం నుంచి రూ.లక్ష రుణం ఇప్పిస్తాని తెలిపారు. గత పదేళ్లలో నియోజకవర్గంలో 1,420 ఇళ్లు మంజూరైతే కేవలం 240 ఇళ్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, 150 పడకల ఆస్పత్రి నిర్మాణం, ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కోహెడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ రూ.200 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, ఆర్డీఓ రామూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

కోహెడలో 392 మందికి..

కోహెడ(హుస్నాబాద్): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో 392 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలతో పాటు మహిళా సంఘాల నుంచి మరో రూ.లక్ష రుణం ఇస్తున్నట్లు చెప్పారు. జూన్ 9 లోపు మంచి ముహూర్తాలు ఉన్నాయని.. ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించాలని సూచించారు. అలాగే పోరెడ్డిపల్లిలో 91 ఇళ్లు పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరు చేశామన్నారు. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఇందిరమ్మ నమూనా ఇల్లును ప్రారంభించారు.

న్యూస్‌రీల్

విద్యార్థులు హిందీలోనూ రాణించాలి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు హిందీలోనూ రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల పాటుగా నిర్వహించిన ఉపాధ్యాయ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి శుక్రవారం డీఈఓ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ హిందీ భాష అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. "హిందీ భాషోపాధ్యాయుల్లో సామర్థ్య నిర్మాణం కోసం కృషి చేసిన శిక్షణ శిబిరం నిర్వాహకులను డీఈఓ అభినందించారు. అనంతరం శిక్షణ అందించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ మనోహర్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు గడువు పెంపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువును జూన్ 30 వరకు పెంచినట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే.. బెస్ట్ అవెలైబుల్ స్కూల్‌లో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన విద్యార్థులు జూన్ 1 నుంచి జూన్ 16 సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు చేయాలన్నారు. జూన్ 20న ఉదయం 11గంటలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, చిత్రంలో నర్సారెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట ప్రచారజాత శుక్రవారం గజ్వేల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డితో కలిసి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరా పార్కు చౌరస్తా వరకు జరిగిన ప్రచార జాత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని అన్నారు. టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ ప్రయోజనాలే కాకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక వసతులున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేలా చొరవ చూపాలన్నారు.

మూల్యాంకనంలో నిర్లక్ష్యం తగదు

- పొరపాట్లు పునరావృతం కావద్దు
- తప్పులు చేస్తే చర్యలు
- ఇంటర్ బోర్డు అబ్జర్వర్ భీమ్‌సింగ్

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మూల్యాంకనంలో నిర్లక్ష్యం తగదని, తప్పులు చేస్తే చర్యలు తప్పవని ఇంటర్ బోర్డు అబ్జర్వర్ భీమ్‌సింగ్ హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మూల్యాంకన కేంద్రం అధికారి రవీందర్‌రెడ్డితో కలిసి అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గత మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లను క్యాంపు అధికారుల దృష్టికి తెచ్చామని, అవి పునారావృతం కాకుండా చూసుకోవాలన్నారు. మూల్యాంకన కేంద్రం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉందని, హైదరాబాద్ ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ప్రతి అంశాన్ని గమనిస్తున్నట్లు చెప్పారు. అధ్యాపకులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విద్యార్థుల జవాబు పత్రాలను ఒకటికి రెండు సార్లు పరిశీలించి మదింపు చేయాలని సూచించారు. క్యాంపు అధికారి, డీఐఈఓ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు నిబద్ధతతో పనిచేసి సిద్దిపేట మూల్యాంకన కేంద్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.



మాట్లాడుతున్న బోర్డు అబ్జర్వర్ భీమ్‌సింగ్, చిత్రంలో డీఐఈఓ రవీందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మంజుల

నేటినుంచి రెండో విడత..

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల రెండో విడత మూల్యాంకనం శనివారం నుంచి ప్రారంభం అవుతుందని, క్యాంపు అధికారి, జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఫిజిక్స్, ఎకనామిక్స్, బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టుల అధ్యాపకులు మూల్యాంకన కేంద్రంలో ఉదయం 10గంటల లోగా రిపోర్టు చేయాలన్నారు. సిద్దిపేట, మెదక్ జిల్లాలలోని ప్రభుత్వ, అనుబంధ, ప్రైవేట్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు అందరూ తప్పనిసరిగా రిపోర్టు చేయాలన్నారు. రిపోర్టు చేయని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలపై నిఘా..



తనిఖీ చేస్తున్న టూ టౌన్ సీఐ ఉపేందర్ తదితరులు

సిద్దిపేట కమాన్: నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల అమ్మకాలపై నిఘా ఏర్పాటు చేసినట్లు టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. శుక్రవారం పలు సీడ్స్, ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. స్టాక్, బిల్ బుక్, తదితర రికార్డులను పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాలు కొనేసమయంలో బిల్లు, రశీదు తీసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విత్తనాలనే కొనుగోలు చేయాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ శాఖ అధికారి శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



ఆయిల్‌పామ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం, కలెక్టర్ తదితరులు

హుస్నాబాద్‌రూరల్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు వస్తాయని, నాలుగేళ్లు కష్టపడితే 30 ఏళ్ల వరకు ఆదాయం వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పోతారం(ఎస్)లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 12,335 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను రైతులు సాగు చేస్తున్నారన్నారు. హుస్నాబాద్ ప్రాంతం భూములు అనుకూలంగా ఉంటాయని 5 ఎకరాలపై బడిన రైతులు సాగుకు ముందుకు రావాలన్నారు. అంతర పంటలను సైతం సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ పంటను అకాల వర్షాలు, వడగళ్ల నష్టం చేయవని చెప్పారు. నర్మెట్టలోనే పరిశ్రమ ప్రారంభానికి సిద్ధం చేశామన్నారు. రైతులకు రవాణా భారం లేకుండా హుస్నాబాద్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయించి పైసా ఖర్చు లేకుండా ఫ్యాక్టరీకి తరలిస్తామన్నారు. రైతుల విజ్ఞప్తి మేరకు రెండో లైన్ డ్రిప్పు ఏర్పాటులో సబ్సిడీకి కృషి చేస్తామని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి తీరుతామని, కొందరు కావాలని ప్రాజెక్టు పనులకు అడ్డుపడుతున్నారని మంత్రి తెలిపారు. గ్రీన్ ట్రిబ్యునల్ సమస్యలను అధిక మించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ముఖ్యం

- యూజీడీపై పర్యవేక్షణ అవసరం
- అధికారులు క్షేత్ర స్థాయిలో ఉండి సేవలందించాలి
- మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: రాబోయేది వర్షాకాలమని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన



కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్మన్ కనకరాజు

పారిశుద్ధ్య నిర్వహణ పనుల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా యూజీడీ నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పట్టణంలో యూజీడీ లీకేజ్ సమస్యలు రావొద్దన్నారు. పట్టణ ప్రజలు దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఫాగింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. పట్టణంలో ఆరుబయట చెత్త వేయకుండా చూడాలని, అందుకు సంబంధించిన నిఘా పటిష్టంగా అమలు పరచాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగాలని, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలన్నారు. పట్టణంలో చెట్లను ఇష్టానుసారంగా నరికివేయకుండా, కేవలం ట్రిమ్మింగ్ చేసేలా చేయాలన్నారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో పగటి వేళ విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందికి ఆదేశాలివ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నారు. అంతకుముందు పలు అంశాలపై కౌన్సిల్ సభ్యులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

రాబోయే మున్సిపల్ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సురేఖ, జిల్లా మంత్రి ప్రభాకర్‌ను ఆహ్వానించాలని సూచించారు. కప్పల కుంట చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎజెండాలోని 13 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

క్లుప్తంగా

ఉత్తమ అభ్యసనకు ఎంపిక


ఉపాధ్యాయురాలు మాధవి

దుబ్బాక: రాష్ట్ర స్థాయిలో విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎస్‌ఈఆర్‌టీ) నిర్వహించే ఉత్తమ అభ్యసన ప్రక్రియకు మండలంలోని గంభీర్‌పూర్ పాఠశాల ఉపాధ్యాయురాలు మాధవి ప్రదర్శన ఎంపికై ంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నూతన అభ్యసన ప్రక్రియను జిల్లాస్థాయిలో నిర్వహించి ఇందులో ఉత్తమ ప్రదర్శనలు ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపించాలని ప్రభుత్వం సూచించింది. ఈ నెల 24నుంచి సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో ఉపాధ్యాయురాలు మాధవి ప్రదర్శించిన ఉత్తమ అభ్యసన ప్రక్రియ (బెస్ట్ ప్రాక్టీస్) రాష్ట్రస్థాయికి ఎంపికై ంది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

అబుదాబి వేడుకలకు అందె భాస్కర్

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఇండియా నంబర్స్ సంయుక్త ఆధ్వర్యంలో దుబాయ్‌లోని అబుదాబిలో నిర్వహించే రాష్ట్ర 11వ అవతరణ వేడుకలకు మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత, అంతర్జాతీయ డప్పు వాయిద్య కళాకారుడు అందె భాస్కర్ ఎంపికయ్యాడు. అబుదాబిలో జరిగే వేడుకల్లో ఆయన తన డప్పు కళాబృందం సభ్యులతో కలిసి కళా ప్రదర్శనలు ఇవ్వనున్నాడు.

బూటకపు ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలి

సీపీఐ నేత చాడ డిమాండ్


మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ పేరిట జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చర్చలకు ఆహ్వానించిన మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా చంపడం దారుణమన్నారు. చిత్రహింసలు పెట్టి కనీసం మృతదేహాలను కూడా కుటుంబ సభ్యులకు అప్పగించకుండా దహన సంస్కారాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. శాంతి చర్చలు జరపాలని సీపీఐ అగ్ర నేతలు, పౌర హక్కుల నేతలు, ప్రజా సంఘాలు కోరినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని పోరాడితే సీపీఐ కార్యకర్తలపై కేసులు పెట్టారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర సమితి సభ్యుడు మల్లేశ్, వనేష్ తదితరులు ఉన్నారు.

ప్రాణం తీసిన టూవీలర్ ఫైనాన్స్

చికిత్స పొందుతూ మహిళ మృతి


మొండమ్మ(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): టూవీలర్ ఈఎంఐ కట్టలేదని, ద్విచక్ర వాహనాన్ని ఫైనాన్స్ వాళ్లు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఓ మహిళ పురుగుల మందు తాగి మృతి చెందింది. ఎస్ఐ విజయ్‌భాస్కర్ వివరాల ప్రకారం... అంత్కపేట గ్రామానికి చెందిన జంగపల్లి అయిలయ్య తన చిన్న కుమారుడు శ్రీధర్ కోసం హోండా యాక్టివాను ఫైనాన్స్‌లో కొనుగోలు చేశాడు. నెల నెలా కట్టాల్సిన ఈఎంఐని సరిగా కట్టడం లేదని, ఫైనాన్స్‌కు చెందిన వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లారు. ఇంటికి వచ్చిన ఐలయ్య వాహనం తీసుకెళ్లిన విషయాన్ని తన ఎందుకు చెప్పలేదని భార్య మొండమ్మ(57)పై కోపపడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 27న రాత్రి ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగింది. దీంతో హుటాహుటిన హుస్నాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణ.. ఉపాధి

- సెట్విన్‌లో స్వయం ఉపాధి కోర్సులు
- ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు
- ఫీజు కట్టలేని వారికి ఉచిత తర్ఫీదు
- సెట్విన్‌తో స్వచ్ఛకర్మ ఫౌండేషన్ ఒప్పందం
- నిరుపేద యువతీయువకులకు వరం


సెట్విన్ కేంద్రంలో మహిళలకు కుట్టు శిక్షణ

హుస్నాబాద్: నగరాలు, పట్టణాలకే పరిమితమైన సెట్విన్ కేంద్రం మారుమూల పల్లెల్లోని మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు శిక్షణ తరగతులను ప్రారంభించింది. నిరుపేద యువత, మహిళలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రోత్సహిస్తోంది. హుస్నాబాద్ పట్టణంలో దాదాపు ఏడాది క్రితం సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ అండ్ ట్రెనింగ్ ఇన్ ట్విన్ సిటీస్) శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. శిక్షణ పొందడానికి కోర్సులను బట్టి రూ.600 నుంచి రూ.2100 ఫీజు వసూలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 160 మంది వివిధ కోర్సుల్లో శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందుతున్నారు. కోర్సులను బట్టి మూడు నెలల నుంచి ఏడాది వరకు డిప్లామా కోర్సులపై శిక్షణ ఇస్తున్నారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులకు కేంద్రంలో శిక్షణ ఇస్తున్నారు.

ఫీజు చెల్లించలేని వారికి ఉచిత శిక్షణ

హుస్నాబాద్ నియోజకవర్గంలో సెట్విన్ ద్వారా ఫీజు కట్టలేని పేద, నిరుపేద, నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు స్వచ్ఛకర్మ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఏడాది కాలం ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి సెట్విన్‌తో ఫౌండేషన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. 2025–2026 సంవత్సరానికి నియోజకవర్గ యువత శిక్షణ ఖర్చులు భరించడానికి, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడానికి ఫౌండేషన్ తన వంతు సహాయం అందించనుంది. ఇందుకు గాను ఫౌండేషన్ రూ.4లక్షలు విరాళంగా ప్రకటించింది. ఏడాదిలో 160 మందికి శిక్షణ ఇవ్వడానికి ప్రతి త్రైమాసికంలో 40 మంది విద్యార్థుల చొప్పున నాలుగు బ్యాచ్‌లలో శిక్షణ కోసం ఖర్చు చేయనుంది. శిక్షణ తరగతులతో మహిళలు ఆర్థిక స్వావలంబనకు అడుగులు వేస్తున్నారు. శిక్షణ పూర్తి చేసిన తర్వాత నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్లను అందజేయనున్నారు. తద్వారా జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.

కోర్సులు ఇవే...

సెట్విన్ శిక్షణ కేంద్రంలో ఫ్యాషన్ డిజైన్ డిప్లామా, బ్యూటిఫికేషన్, మగ్గం వర్క్స్, మెహందీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ప్రీ ప్రైమరీ టీచర్స్ ట్రైనింగ్, జూట్ బ్యాగుల తయారీ, ఎలక్ట్రికల్, ఎయిర్ కండీషన్ వంటి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం బ్యాచ్‌ల వారీగా 105 మంది శిక్షణ పొందుతున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ పొందుతున్నారు. పట్టణానికి చెందిన మహిళలే కాకుండా వివిధ గ్రామాల నుంచి మహిళలు శిక్షణ పొందుతున్నారు. వివిధ కోర్సులకు సంబంధించి క్లాసులతో పాటు ప్రాక్టికల్‌గా తర్ఫీదు ఇస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో మహిళలు కూడా శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వివిధ కోర్సులకు గాను పట్టణాల్లో శిక్షణ తీసుకుంటే వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అతి తక్కువ ఫీజుతో మహిళలు శిక్షణ పొందుతూ ఉపాధి పొందుతున్నారు.


కంప్యూటర్‌లో శిక్షణ పొందుతున్న యువతులు


బ్యూటిఫికేషన్‌లో శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

ఉపాధి పొందుతున్నా..



సెట్విన్ కేంద్రంలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తీసుకున్నా. మేకప్ ఎలా చేయాలో నేర్చుకున్నా. వివాహ శుభకార్యాలకు మహిళలు, యువతులకు మేకప్ వేసి ఉపాధి పొందుతున్నా. చాలా మంది పిలుస్తున్నారు. ఇంటికే పరిమితమైన నాకు శిక్షణ ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఇతరులకు నేర్పిస్తున్నా.

–స్వప్న, హుస్నాబాద్

సద్వినియోగం చేసుకోండి



సెట్విన్ కేంద్రం ద్వారా వివిధ కోర్సుల్లో నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో కేంద్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. శిక్షణ ద్వారా చాలా మంది మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు. శిక్షణ పొందిన వారికి ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళాను ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం కూడా స్వయం ఉపాధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తోంది.

– అమీనా, సెట్విన్ జిల్లా అధికారి

క్యాడావర్ వర్క్‌షాపు ప్రారంభం


వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు

ములుగు(గజ్వేల్): లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం మెడికల్ కళాశాల వేదికగా శుక్రవారం హైదరాబాద్ షోల్డర్ కోర్స్ –2025 క్యాడావర్ వర్క్‌షాప్ ప్రారంభమైంది. కళాశాల చైర్మన్ డాక్టర్. ఆర్ యాకయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్థోస్కోపీ ఫౌండేషన్‌తో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. 'మరమ్మతు చేయలేని రొటేటర్ కఫ్ టియర్' అనే ప్రత్యేక టీమ్‌తో ఈ వర్క్‌షాప్ కొనసాగింది. సదస్సులో ఫ్రాన్స్‌కు చెందిన డా. జీన్ గ్రింబర్గ్, డా.వీటోరాస్ జెర్మోలాజేవాస్(లిథువేనియా), డా. చాంగ్ హీ బేక్ (దక్షిణకొరియా), డా.బి.చంద్రశేఖర్ (కిమ్స్ సన్‌షైన్), డా.శ్యామ అనూప్‌రెడ్డి(రెనోవా సెంచరీ హాస్పిటల్), డా.జీన్ కానీ(ఫ్రాన్స్) లు క్యాడావర్ డెమోన్‌స్ట్రేషన్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా రొటేటర్ కఫ్ టియర్ వంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలపై అవగాహన కల్పించారు.

ప్రమాదాలను నివారించేందుకు చర్యలు

- బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి
- సిద్దిపేట కమిషనర్ అనురాధ


తొగుట పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న కమిషనర్ అనురాధ

తొగుట(దుబ్బాక): రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సిద్దిపేట కమిషనర్ అనురాధ పోలీసులను ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్, సీఐ కార్యాలయాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన ప్రదేశాల్లో బ్లాక్ స్పాట్స్ వద్ద ఆర్‌అండ్‌బీ అధికారుల సమన్వయంతో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్టేషన్‌లో ఉన్న వాహనాల కేసులను పరిష్కరించి యజమానులకు అప్పగించాలని సూచించారు. అంతకుముందు పోలీస్ స్టేషన్, సీఐ కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, సీఐ లతీఫ్, సీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, తొగుట, రాయపోల్, కుకునూర్‌పల్లి, దౌల్తాబాద్ ఎస్ఐలు రవికాంత్‌రావు, రఘుపతి, శ్రీనివాస్, ప్రేమ్‌దీప్ పాల్గొన్నారు.

గొంతు కోసి మహిళ దారుణ హత్య

- నగల కోసమే దుండగుల ఘాతుకం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ రవీందర్ రెడ్డి
- చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లిలో ఘటన


మృతురాలు బాలలక్ష్మి (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): పట్ట పగలే మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన మండల పరిధిలోని కమ్మర్లపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... గ్రామానికి చెందిన గాలి బాలలక్ష్మి(50) ఇంట్లో కిరాణా షాపు నడుపుతుండగా, భర్త సుధాకర్ ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి కూతురు స్వాతి, కుమారుడు వెంకటేశ్ ఉన్నారు. శుక్రవారం ఉదయం సుధాకర్ ఆటో తీసుకుని సిద్దిపేటకు వెళ్లాడు. మధ్యాహ్నం గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న బాలలక్ష్మిని కత్తితో గొంతు కోశారు. దీంతో ఆమె మృతి చెందింది. అనంతరం దుండగులు ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకొని పారిపోయారు. సాయంత్రం భర్త సుధాకర్ ఇంట్లోకి వచ్చి చూడగా బాలలక్ష్మి రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉండటంతో స్థానికులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ బాలకృష్ణ, ప్రొహిబిషన్ ఎస్ఐ సైఫ్ అలీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి సాక్ష్యాలను సేకరించారు. బంగారు ఆభరణాల కోసమే గుర్తు తెలియని దుండగులు మహిళను హత్య చేసి ఉంటారని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఐదు తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కూలి డబ్బుల కోసమే హత్య

- నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరేందర్‌గౌడ్


కేసు వివరాలు తెలుపుతున్న డీఎస్పీ

తూప్రాన్: కాళ్లకల్ పారిశ్రామిక వాడలో కూలి డబ్బుల కోసం తోటి కార్మికుడిని హత్య చేసిన నిందితుడిని 24 గంటల్లో పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన బుధవారం మనోహరాబాద్ మండల పరిధిలో చోటు చేసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం తూప్రాన్‌లోని తన కార్యాలయంలో హత్యకు గల కారణాలను డీఎస్పీ నరేందర్‌గౌడ్ వెల్లడించారు. కాళ్లకల్ పారిశ్రామిక ప్రాంతంలోని కిషాన్ పరిశ్రమలో లేబర్ కాంట్రాక్టర్ ఏసుదాసన్ వద్ద కేరళకు చెందిన నలినికుమార్, మేడ్చల్ జిల్లా ఉప్పల్‌లోని చిలుకనగర్‌కు చెందిన వద్దవత్ నరేష్, అంజాద్‌లు ముగ్గురు కార్మికులుగా పని చేస్తున్నారు. వీరికి పరిశ్రమలో ఒకే గదిని కేటాయించారు. కాగా ఈ నెల 28న బుధవారం పనులు ముగించుకున్న అనంతరం అంజాద్ ఇంటికి వెళ్లిపోయాడు. వారికి కేటాయించిన గదిలో నలినికుమార్, నరేష్ ఉన్నారు. రాత్రి 7గంటల సమయంలో మద్యం సేవించేందుకు కాళ్లకల్‌కు వెళ్లారు. అక్కడ నలినికుమార్ మాత్రమే మద్యం సేవించాడు. నరేష్ మద్యం సేవించలేదు. అనంతరం వారి గదికి వచ్చారు. సుమారు 11గంటల సమయంలో ఇద్దరు గొడవపడ్డారు. నలినికుమార్ నరేష్‌ను ఇంటికి వెళ్లి పోవాలని బెదిరించాడు. తనకు లేబర్ కాంట్రాక్టర్ ఇచ్చిన కూలి డబ్బులు రూ.వెయ్యి ఇస్తే వెళ్లిపోతానని చెప్పాడు. రూ.100 మాత్రమే ఇస్తానని గట్టిగా అరవడంతో.. కోపోద్రిక్తుడైన నరేష్ నలినికుమార్ చెంపపై గట్టిగా కొట్టి తోసేశాడు. దీంతో కిందపడిన అతడికి తల వెనుకాల తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. నిందితుడు నరేశ్ మృతుడి సెల్‌ఫోన్ తీసుకొని వెళ్తుండగా సెక్యూరిటీ గార్డు నిరాకరించగా కంపెనీ ప్రహరీగోడ దూకి పారిపోయాడు. కాగా సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. 24 గంటల వ్యవధిలో హత్య కేసును ఛేదించిన సీఐ రంగాకృష్ణ, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్‌లను అభినందించారు.

ఆకలి ఆరాటం.. జీవన పోరాటం


చెత్తకుప్పలో ఏరుకుంటున్న వ్యక్తి

సృష్టిలో ప్రతి జీవి ఆహారం కోసం ఏదో ఒక అన్వేషణ చేస్తూనే ఉంటుంది. మనుషులు మాత్రం ఆకలి తీర్చుకోవాలంటే ఏదో ఒక కష్టం చేయాల్సిందే.. కానీ కొంతమంది చెత్తా చెదారంలో ఏదో ఒకటి ఏరుకొని దానిని విక్రయించి వచ్చిన డబ్బులతో తమ ఆకలి తీర్చుకుంటారు. సిద్దిపేట పట్టణంలోని కప్పలకుంట సమీపంలో శుక్రవారం చెత్తకుప్పలో ఓ వ్యక్తి ఏరుకుంటూ దీనంగా కనిపించిన చిత్రాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

–సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

విత్తన శుద్ధి తప్పనిసరి

సీనియర్ శాస్త్రవేత్త డా. చిన్నబాబు నాయక్


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త చిన్న బాబునాయక్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని, లేనిచో వేర్లను నీటిలో ముంచిన తర్వాతే నాటు వేయాలని భారత వరి పరిశోధన సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డా. చిన్నబాబు నాయక్ పేర్కొన్నారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం తునికి ఆధ్వర్యంలో శుక్రవారం మండల రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి సాధించడానికి విపరీతమైన రసాయన ఎరువుల వాడకం వల్ల నేల సారాన్ని కోల్పోయిందన్నారు. రైతులు వినియోగించే ఎరువుల్లో 35 శాతం మాత్రమే మొక్క తీసుకుంటుందని, మిగతా 65 శాతం ఎరువులు నేలలో ఉండటం మూలంగా, నేల చౌడు బారుతుందని తెలిపారు. రైతు కనీసం మూడేళ్లకోసారి పంట మార్పిడి చేయాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయం చేయాలని, జీవన ఎరువులు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరి పరిశోధన శాస్త్రవేత్త జేసుదాసు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్, మెదక్ ఆత్మ డిప్యూటీ పీడీ అంబిక, ఏఈఓ అనిత, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం


ఉద్యానదర్శిణి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న షేక్ యాస్మిన్ బాషా

రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ షేక్ యాస్మిన్ బాషా

ములుగు(గజ్వేల్): ఆయిల్ పామ్‌తో పాటు ఇతర ఉద్యాన పంటలు పండించే రైతులకు ప్రభుత్వం రాయితీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అధ్యక్షతన రైతులు, ఉద్యాన శాఖ అధికారులు, విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 13 లక్షల ఎకరాల్లో మాత్రమే ఉద్యాన పంటల విస్తీర్ణం ఉందని, అయితే పదేళ్ల నుంచి క్రమంగా తగ్గుతుందని తెలిపారు. ఎంఐడీహెచ్ ద్వారా ఉద్యాన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.145 కోట్ల నిధుల మంజూరికి అనుమతిచ్చిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీని అందజేస్తుందన్నారు. వాతావరణానికి అనుకూలంగా రైతులు వ్యవసాయం చేయాలని ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన వర్సిటీ అధికారులు భగవాన్, ఛీనానాయక్, లక్ష్మినారాయణ, సురేష్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాసన్, అనిత కుమారి, సుచిత్ర, వెకటలక్ష్మి, వీణాజోషి తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ అనంతలోకాలకు..


రాహుల్ (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరోక యువకుడు గాయపడిన ఘటన మండలంలోని కిష్టంపేట గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు వివరాల ప్రకారం... నంగునూరు మండలం పాలమాకుల గ్రామానికి చెందిన రంగు రాహుల్(19) ఇటీవలే ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. అతనికి బావ వరుసైన శీలే అజయ్ పుట్టినరోజు కావడంతో శుక్రవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుందామని ఉదయం ఇంటి నుంచి స్కూటీపై రాహుల్, అజయ్ బయలు దేరారు. స్వామి వారిని దర్శించుకున్నారు. తిరిగి వస్తున్న క్రమంలో కిష్టంపేట గ్రామ శివారులో చేర్యాల నుంచి కొమురవెల్లి వైపునకు వెళ్తున్న అశోకా లీలాండ్ వాహనంను ఎదురుగా ఢీకొట్టారు. రాహుల్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గాయపడిన అజయ్‌ను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని కారు ఢీకొని చిన్నారి..


గూల్ల రక్షిత్(ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు కాగా వారి కుమారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బెజ్జంకి ఎస్‌హెచ్‌ఓ, ఏఎస్ఐ శంకర్ రావు కథనం ప్రకారం... కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన గూల్ల శ్రీకాంత్ భార్య కల్యాణి, కుమారుడు రక్షిత్(7)లతో కలిసి ద్విచక్ర వాహనంపై బెజ్జంకిలోకి బంధువు ఇంటికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో బెజ్జంకి క్రాసింగ్ సమీపంలో గల రాజీవ్ రహదారిపై హైద్రాబాద్ నుంచి వస్తున్న గుర్తు తెలియని నల్ల రంగు కారు అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. రక్షిత్ రోడ్డుపై డివైడర్‌కు తగిలి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్, కల్యాణిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడపడంతో..


ధ్రువాన్స్‌రెడ్డి (ఫైల్)

నర్సాపూర్: అజాగ్రత్తగా ద్విచక్రవాహనాన్ని నడపడంతో జరిగిన ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ లింగం కథనం ప్రకారం... చిలిపిచెడ్ మండలం చండూరుకు చెందిన రాంరెడ్డి తన భార్య మాధవి, తన కుమారుడు ధ్రువాన్స్ రెడ్డి(03)లను తన స్కూటీపై తీసుకొని శుక్రవారం ఉదయం మల్లంపేట వెళ్తున్నాడు. ఈ క్రమంలో నర్సాపూర్ పట్టణ శివారులో రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను స్కూటీ ఢీ కొట్టడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మాధవికి తీవ్ర గాయాలవ్వడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక వైద్యం చేసి హైద్రాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనూ ఫర్నిచర్ గోదాంలో అగ్నిప్రమాదం

- అదుపులోకి వచ్చిన మంటలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ ప్రభాకర్


అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న గోదాంలోని ఫర్నిచర్

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటి గ్రామ శివారులో ఉన్న అను ఫర్నిచర్ గోదాంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గోదాంలో పనిచేసేవారు భోజనానికి వెళ్లిన సమయంలో పాత వస్తువులు ఉండే చోట మంటలు చెలరేగి భవనంలో ఉన్న కొత్త ఫర్నిచర్‌కు మంటలు దావానంలా వ్యాపించాయి. అయితే మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పటాన్‌చెరు, జీడిమెట్ల, కూకట్‌పల్లి పాశమైలారం ప్రాంతాల నుంచి ఐదు అగ్నిమాపక శాఖ అధికారులు ఫైర్ ఇంజిన్లను తీసుకొచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలకు ఫర్నిచర్ ఉన్న భవనం బీటలు బారి కూలిపోయే స్థితికి చేరుకుంది. ఎవరూ భవన సమీపానికి వెళ్లకుండా డీఎస్పీ ప్రభాకర్, సీఐ స్వామి గౌడ్ పోలీస్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరో పక్క మాదాపూర్ నుంచి మంటలను ఆర్పే రోబో వచ్చినప్పటికీ లోపలికి వెళ్లేందుకు వీలు లేక బయటే ఉండి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించింది. దీంతో అగ్నిమాపక శాఖ అధికారులు బ్రాంటో స్కై లిఫ్ట్ అగ్నిమాపక వాహనాన్ని తెప్పించి చివరకు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ... మధ్యాహ్నం సమయం కావడంతో పని చేసే కార్మికులు భోజనానికి వెళ్లడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. అయితే షెడ్‌లో వెల్డింగ్ చేస్తుండగా మంటలు అంటుకుని ప్రమాదం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా విద్యుదాఘాతంతో ఈ ప్రమాదం సంభవించిందని అను ఫర్నిచర్ సంస్థ హెచ్‌ఆర్ జోషి తెలిపారు. సంఘటనా స్థలాన్ని హైడ్రా రీజనల్ అగ్నిమాపక అధికారి జయప్రకాష్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌లు, బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ పర్యవేక్షించారు.